# 5 శకునము

భా. బు. అను ఆయనకు శకునము లనిన పిచ్చి పట్టుదల. ఆయన పయన మగువేళ కనుచూపు మేరలో విధవగాని, చెవి వినుమేరలో తుమ్ము గాని కూడదు. కర్మము చాలక ఒంటి బ్రాహ్మణుడుగాని విధవగాని [అండగత్తె యయినను సరేయని కొందఱందురు.] ఎదురుపడుచో-ముందు తన మాట యెటులున్నను-వారికి మాత్రము కీడే! తుమ్మినవారు చాల కాల మేడ్వవలసినవారే. శ్రీ భా. బు. గారు పరాక్రమశాలురు. కావున "తమరే మా కపశకున"మని ఎవరును అనలేకపోయెడువారు. అది యటుండె. ఈ వరుసను భా. బు. గారి పయన మొకొక్కతూరి-అది యెంత యావశ్యకమయినను-నెలల తరబడి-తోసికొని పోయెడిది.

భా. బు. గారి యింటికి సుమారు నూఱు గజముల దూరమున నెదురుగా నొక రచ్చ యరుగుండెడిది. చింతచెట్టొకటి దానికి ఛత్రము. మే మచటఁ గూరు చున్నంతకాలము ఛత్రపతిత్వ మనుభవించుచుండెడి వారము.

ఒకనాడు భా. బు. గారు పయనమయిరి. కాబోలు, తొంగి తొంగి చూచుచు తమ ఇంటిమెట్లు దిగుచుండిరి. నే నది చూచి ముక్కు నలుపుకొని తుమ్మితిని. భా. బు. గారు ఏడవ అర్థము సెప్పుచు లోనికేగిరి. రెండు మూడు తడవలిటులు చేసితినిగాని వారి మనసు మార్చలేకపోతిని. కారణ మూహించుట కడు సులభము. వారు ఏ పనికై పయనించుచున్నారో ఆ

పని నెఱవేరునటులు గూడఁ జూడఁ గలుగుచో వారి కీ తుమ్ములో నేమియు లేదని తోచును గాని, ఊరక తుమ్ముచు గూరుచున్నచో నేమి లగ్గు ? ఈ విషయము నా కపుడు తట్టలేదు.

"శ్రీ" అను వారొక రీవిషయమున ప్రచండులు. వారెపుడు బయలు దేరినను నే నెదురు. వారు నా నిమిత్తముగా పగట పయనించుట మానిరని తెలిసి నేను నా యీ మిత్రుని కెదురు సనుట మానుకొనవలసి వచ్చెను. ఇచటఁ గూడ నా సదుద్దేశము నెఱవేఱలేదు. ఏల అని యందురా ? వినుడు. మీ రెక్కడికి విజయము చేయుచున్నారు ? ఎందులకు ? అని నే నడుగగా—ఇటు లడుగుట అపశకునములలో పెద్ద అపశకునమని నాకు తెలియదు, తెలియనే తెలియదు—వారు మఱి మాటాడక మూతి ముఱకటించుకొను చుండెడివారు.

ఒకనాడు నేనును శ్రీ. శో. గారును, మాటాడుచుంటిమి. శ్రీ వారు వేషభాషలలో తెల్లదొరలు, మనసులో మాంధాతలు.

మా ఆసుపత్రిలో దొర కిరస్తానీ. దీర్ఘ వ్యాధిగ్రస్తునికడ మందు నూఱిపోయుటకు బదులు బైబిలు నూఱిపోయుచున్నాడు.

"అయ్యా, మంచి పనియే చేయుచున్నాడు."

"మీరు గూడ ఒక బైబిలు కొనుడు."

"అయ్యా నా కా దృశ్యము చూడవలయునని కలదు."

"ఓరీ, డ్రైవరును పిలువుము. ఆగుమాగుము. నేడు వర్జ్య మెపుడో" నాకు నవ్వు వచ్చెను.

"ఏమిటండీ నవ్వెదరు ? మొన్న మా నాయనను-కుమారుని—"పోవలదయ్య" అని అంటిని. వెళ్ళరు గదా అని అనుకొంటిని. నాకు

తెలియకుండగా వారు వెళ్ళిరి. ఏమాయెనో చూచితిరా ? వారి మోటారు ఒక చెట్టును డీ కొట్టెను. చెట్టు కొంత చెడెను. మోటారు కొంత ముక్కబోయెను. వీరి యొడలు కొంత నలిగెను. పంచాంగము తీసి చూసితిని. వర్జ్యము. నాటఁగోలె. మీరు వర్జ్యములో కదలరు. మీకు కూడ నొక తూరి ఆ సంబరము-"

"ఆ మోటారుతోపాటు బయలుదేరిన అన్ని మోటారులకు ఆ సంబరము కలిగినదా ?

"వర్జ్యపు గడియలు 2½లో ఏదో ఒక రెప్పపాటు కాలము విషకాల మందు రండీ ; ఆ మోటారు అప్పడే బయలుదేరి యుండును."

"చిత్తము. వాదమున కొప్పుకొందును. చూడుడు. వర్జ్యమని చెప్ప బడు ఆ 2½ గడియల కాలములో ప్రతి రెప్పపాటు కాలమునను కొన్ని వందల వాహనములను బయలుదేరదీసి వానిలో నూటికి తొంబదికి ఆ వైభవము పట్టినచో, అపుడు ఆ కాలము వర్జ్యమని నిర్ధారించుట శాస్త్రీయము గాని గతాను గతికముగా, నమ్మివైచుటకు నా మనస్సు తిరస్కరించును."

"ప్రాచీను లటులు చూడకుండ అసత్యములు పలికి దైవ స్వరూప మగు కాలమును దయ్యముగా చూపి ప్రజలను భయపెట్టుదరని మీ యూహయా ?"

వర్జ్య కాల మే కార్యారంభమునకును పనికిరాదని లోకుల మీద భయమును రుద్దువారు-చనిపోయిన ప్రాచీనులను డాలుగా పెట్టుకొనుట కంటె తమ చేతిలోపని ఎక్స్ పరిమెంట్ చేసి చూపి ప్రజలకు సత్య పరిచయము చేయవలయును."

"ఔనండీ. ఇట్టి వెన్నని చేయగలము ?"

"ఔను; కాలపరిక్షయము బుద్ధి పరిక్షయము చేసికొని అంధదైవము ననారత మారాధించుచుఁ గూరుచుండగలము. చీనావారి కయినను చేతన కలుగును గాని భారతీయులకు..."

మా యీ ప్రసంగ మధ్యమున డ్రైవరు వర్శ్యమును మూట కట్టు కొని వచ్చెను.

"గార్గ్య సిద్ధాంత మత ముషఃకాల కలన
శకున మూనుట యది బృహస్పతి మతంబు
వ్యాసమతము మనః ప్రసాదాతిశయము
విప్రజన వాక్యమరయంగ విష్ణుమతము."

అని నేను చదివితిని. వారు మోటారు బీగమును డ్రైవరు నడిగి జేబులో దాచికొనిరి.

నే నింజరమున ఒకానొక రాత్రి చదువుకొనుచుండగా భట్నవల్లి నుండి ఒక విద్యార్థి వచ్చి "అ. శాస్త్రికి పది లంఘనములు. రోగము విషమనుగా నున్నది. గురు చరణులు వెంటనే మిమ్ము రమ్మని పంపిరి" అని చెప్పెను.

సూర్యు డుదయింపగనే నేను బయలుదేరితిని. పదియేండ్ల కన్య యొకతె నా కెదురాయెను. నా చుట్టునున్న వారందరును హర్షించిరి.

నేను ముక్కుకు సూటిగా పోవుచుంటిని. గోదావరిపాయలో నావ చెడిపోయెను. ఈది దాటితిని. బండి దొరకలేదు. ఎట్లో రోగి కడకు వెళ్ళితిని. నన్ను చూచి రోగి "అమ్మ ఇక బెంగలేదు" అని అనెను. అది సంధి మాట!

అమలాపుర మక్కడికి దాపు. వైద్యుని కొరకు పోతిని. అతడు ముస్లిము. యల్. యమ్. యస్. అతడపుడు క్షౌరములో నుండెను. నేను నా తొందరలో పరిచయ వాక్యములు చెప్పి రోగి లక్షణము లేకరువు పెట్టుచుంటిని. "అయ్యో, ఇది అమంగళ సమయము," అని అత డనెను.

"ఇదేమి టండీ ఇది మంగళకర్మ" అని నేనంటిని.

"కర్మ మంగళకర్మయేగాని ఆ కర్మ జరుగుచున్న కాలము మీరు వచ్చిన పని కమంగళము. మీ వైద్య గ్రంథములో మీ రెచటను చూడలేదా?"

నే నేమో పీర్ల పండుగ చేసికొనుచున్నటులును, ఆయన యేమో ఏకాదశీవ్రత మనుష్ఠించు చున్నటులును నాకు తోఁచెను. ఈ నా యవస్థ నాతడు కనుగొనెనేమో "అది టైఫాయిడ్. పైగా సంధి. మీరు అంగడికి పోయి బ్రాంది కొనిరండు" అనెను. అంగడికి పోయితిని. అంగడివాడు సీసా తీయుచుండగా చేయి జారెను. సీసా ముక్కలై బ్రాంది యంతయు నేల పాలాయెను. అంగడిలో మరొక సీసా లేదు. ఉత్త చేతులతో వైద్యు నింటికి మఱలితిని. అతడిది విని "ఎట్టి అపశకునమండీ" అని అనెను.

"సరియ కాని బయలు దేఱుడు."

"ఇంకను బయలుదేఱు మందురా ?"

"అపశకునములు కూడ నిదానకోటిలో చేరుట ఇటు వైద్యశాస్త్రమునకును ఆరోగ్యము కాదు. అటు జ్యోతిషమునకు వెలుఁగు కాదు."

"మీ రెంత తార్కికులండీ; ఏ శాస్త్రమున కాశాస్త్రము వేఱుకాదండీ. ఒకదానితో అన్నిటికిని సంబంధము కలదండీ. ఐనా నా కేమీ తెలియును లెండు పోదము."

మే మింటికి చేరుసరికి రోగి మింటికిఁ జేరెను.

★★